వంశీ

# వెన్నెలబొమ్మ



# వెన్నెల బొమ్మ

## వంశీ

ఎమెస్కో

# వెన్నెల బొమ్మ
వంశీ

నవంబర్, 1978.
నవంబర్, 2001.
తృతీయ ముద్రణ : **అక్టోబర్, 2007**

మూల్యం : రూ. **50**/-

డి.టి.పి.
పల్లవి గ్రాఫిక్స్,
హైదరాబాద్

ప్రింటర్స్:

ప్రచురణకర్తలు:
**ఎమెస్కో బుక్స్**
విజయవాడ - 2
98499 92890
email: emescobooks@yahoo.com

# అంకితం

శ్రీ వి. మధుసూదనరావు, శ్రీ కొమ్మినేని శేషగిరిరావు,
శ్రీ కె.విశ్వనాథ్, శ్రీ సింగీతం శ్రీనివాసరావు,
శ్రీ భారతీరాజా, బాపు, కె. బాలచందర్, వి.శాంతారామ్,
సత్యజిత్‌రే, గురుదత్, బిమల్ రాయ్,
విలియమ్ వైలర్, అకీరాకురసోవా, జోల్టన్ ఫాబ్రి,
క్రిస్టోఫ్ కిస్లోవస్కీ, స్టాన్లీ కూబ్రిక్, ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్,
ఇంగ్మార్ బర్గ్‌మెన్, ఫెలిని, టార్కవస్కీ, జాన్ హూస్టన్,
గెస్సెప్పి టోరంటోర్
ఈ మహానుభావులందరికీ నమస్కరిస్తూ
భక్తితో ఈ నవల్ని సమర్పిస్తున్నాను.

–వంశీ

## ఇతర రచనలు.......

రవ్వలకొండ

గోకులంలో రాధ

ఆనాటి వానచినుకులు

గాలికొండపురం రైల్వేగేటు

మహల్లో కోకిల

మంచుపల్లకీ

# వెన్నెల బొమ్మ

"గుండెలమీద కాలిన సిగరెట్ మచ్చ పెద్దరచ్చులా ఉంటుంది. ఎఱ్ఱటికళ్ళు- తెల్లటి ఒళ్ళు- తొమ్మిదేళ్ళు. ఈ గుర్తులున్న అబ్బాయి మీకెక్కడైనా కన్పించాడా అయ్యా!"

చెన్నై సిటీ స్లమ్ ఏరియాలో అప్పుడప్పుడూ ఒక ఎయిర్‌కండిషన్డ్- మారిస్ కారు అగుతుంది. అందులోంచి దిగిన ఒక ప్రఖ్యాత సినీతార, ఆ క్షణాన ఆమెకి తారసపడ్డ ప్రతీ ముష్టివాణ్ణీ- మురికివాణ్ణీ- కుష్టువాణ్ణీ అలా ప్రశ్నిస్తుంది. వాళ్ళు తెలీదన్నాక, నిరాశతో తిరిగి వెళ్ళిపోతుంది.

* * *

"యూ బ్లడీ బాస్టర్డ్. నా బాబుని నాకు కాకుండా దూరం చేస్తావా? జాగ్రత్త! ఆరవసారి జైలు కెళ్ళగలవ్. ఇంకా నిలబడ్డావేం. పోరా ఫో... ఫో..." అలా అవమానిస్తుందామె. ఆమె ఒక పాపులర్ సినీస్టార్. పేరు చాలా అందంగా ఉంటుంది. "శృతి".

ఆమె మాటల్ని మౌనంగా భరిస్తున్నాడతను.

"నీక్కాదూ చెప్పేది? వెళ్ళు... అసలు వాణ్ణి ముట్టుకునే హక్కూ- అర్హతా యెవరిచ్చారు నీకు?"

"అది కాదు శృతీ!"

"ఇంకేం చెప్పకు. వెళ్ళు. తియ్యటి విషానికి కేంద్రానివి నువ్వు. ఆ గరళాన్ని నువ్వు పనిచేసే ఆ పత్రికలో రాసుకో. ఫో. నా బాబుని కాస్సేపు తనివితీరా చూస్తాను ఫో... ఫో..."

మౌనంగా బయటికొచ్చేశాడతను. అతని పేరు చైతన్య. జర్నలిస్టు. ఆమెదీ, అతన్దీ చాలా ఏళ్ళ సంబంధం. రాసుకుంటే అదో పెద్ద ఉద్గ్రంథం.

అతనలా వెళ్ళిన మరుక్షణం తన బాబుకి ముద్దుల వర్షం కురిపించింది. వాడిని ఎన్నో ప్రశ్నలు వేసింది.

"ఇన్నాళ్ళూ నీ ఎడబాటు భరించలేక చచ్చాన్రా బాబూ! ఏమిటలా నవ్వుతున్నావ్! ఆ జర్నలిస్టు నిన్నెక్కడదాచాడూ? ప్రెస్సులో నల్లరంగు తుడిచిన పాతకాయితాల గుట్టలోనా? ఎంత అనాథని చేశాడ్రావాడు నిన్ను! రా... రా బొజ్జుందువురా."

బాబు నవ్వుతున్నాడు. కోటి మల్లెలు విరబూసినట్టూ... కోటి సితారలు మెరిసినట్టూ.

కానీ... వాడు ఉలకడం లేదూ... పలకడం లేదు. నిర్జీవంగా నవ్వుతూనే ఉన్నాడు.

వాడు... ఒక అందమైన ఫోటో ఫ్రేములో బంధించబడి ఉన్నాడు. బాబు ఫోటోని యథాస్థానంలో అమర్చింది శృతి.

శృతి ఉన్మాది కాదు. కానీ బాబు ప్రస్తావనలో ఆమె ఉన్మాదే అయితీరుతుంది.

* * *

"శృతిగారూ! మీ బాబు గుండెల మీద సిగరెట్‌తో వాళ్ళ డాడీ కాల్చారా చిన్నప్పుడు?"

"నో... ఆ ప్రశ్నవేసి, నేను స్పెక్యులేషన్‌కి గురయ్యే స్థితికి తీసుకురాకండి. అది నా విషాదపు దినాల్లో ఎలాగో జరిగిపోయింది."

"ఇట్సాల్ రైట్. ఏ సంవత్సరంలో తప్పిపోయాడో గుర్తుంది కదూ?"

"1987 నవంబరు 20వ తేదీ అర్ధరాత్రి."

"ఎక్కడ?"

"వడపళని కోయిల్ ప్రాంతాన మస్క్యూ స్ట్రీట్... అదే మసీదు తెరూ లేదూ?"

"ఆఁ... ఆఁ... విన్నాను. అది స్లమ్ ఏరియా... అంతేకాదు, చాలా డర్టీ ఏరియా కూడానట".

"ఔను మాధవరావుగారూ! ఆ ఏరియాలోనే నా బాబు తప్పిపోయింది."

రాత్రి 8 గంటల సమయంలో సినిమానటి శృతి మేడలో చాలా సంవత్సరాల క్రితం కనుమరుగైన శృతి కొడుకు గురించి చర్చ జరుగుతోంది.

మరో రెండు గంటల్లో ఆమె మార్ఫియా తీసుకుని మత్తుగా నిద్రపోతుంది. నిజానికి ఇలాంటి రాత్రివేళలు ఆమె ఎవరితోనూ డిస్కషన్‌కి దిగదు. తన జీవితానికి కావల్సిన ఎంతో ముఖ్యమైన విషయం గాబట్టి ఆమె మాట్లాడ్తోంది, సేతుమాధవరావు అనే ఒక ఫ్లాప్ ప్రొడ్యూసర్‌తో.

"మీ బాబుని అప్పగించే బాధ్యత నాది. సరేనా!" నిశ్చయంగా అన్నాడు సేతుమాధవరావు.

అంత నిశ్చయంగా ఆమెతో ఇంతవరకూ ఎవరూ అన్లేదు. అందుకే ఆ క్షణాన ఆమె ఎంతో ఆనందాన్ని అనుభవించింది. అనంతరం అతన్ని ప్రగాఢంగా విశ్వసించింది.

"నా చుట్టూ ఉన్న కల్మషాన్నీ... కౌటిల్యాన్నీ నా ఆంతర్యంలో రుగ్మతల్నీ... బలహీనతల్నీ నేను తుడిచివేయాలంటే, కాదు విసర్జించాలంటే నా బాబు నాకు నూరుశాతం అవసరం. అందుకే మిమ్మల్ని నమ్ముతున్నాను."

"అప్పగించాక నమ్మండి" అని వాచీ చూసుకుని...

"నా విషయం చెప్తారని వచ్చాను" అన్నాడు ఆతృతగా.

"మరే నా బాబుని వెదికి తెచ్చాక మీరు కోరిన బహుమానం ఇస్తాను."

"లీవ్ దట్ టాపిక్ శృతీ! రెండు నెలల అనంతరం మీ బాబు మీ ఒడిలో ఉంటాడు. సరేనా?"

"థాంక్స్. మాధవరావుగారూ! థాంక్స్ ఎలాట్".

కాస్సేపు సంభాషణయ్యాక...

"మాకిచ్చే డేట్స్ సంగతి చెపితే..." అన్నాడు మాధవరావు.

"ముహూర్తం ఎప్పుడూ?"

"ఈనెల 28న అరుణాచలం స్టూడియోలో."

"మొన్న ఏదో పత్రికలో చదివాను జెమినీలో అని."

"మీరు చదివింది కరెక్టే... ఈ మధ్య ప్లేబాక్ ఆర్టిస్టు జేసుదాసు సౌండ్ ఎక్విప్‌మెంట్ కొత్తది తెప్పించాడట, అరుణాచలం స్టూడియోకి. సౌండ్ క్లారిటీ బాగుంటుందంటున్నారు. అందుకని ప్రోగ్రాం ఛేంజ్ చేశాం."

"షెడ్యూల్ ఎప్పట్నుంచి?"

"మార్చి లాస్ట్ వీక్‌లో. ఆ నెలంతా మీ డేట్లు మాకివ్వాలి."

"మార్చి లాస్ట్ వీక్‌లోనే శైలూషి చిత్ర వాళ్ళకి డబ్బింగ్ కాల్‌షీటిచ్చాను."

"పోనీ ఈ నెల ఇవ్వండి శృతిగారూ! షెడ్యూలు ఛేంజ్ చేసుకుంటాం."

"ఈనెల 10 నుంచి శివరంజనీ మూవీస్ వాళ్ళ డ్యూయెట్స్ కాశ్మీరులో తీస్తారట. కాశ్మీరులో వాళ్ళ వర్క్ 10 రోజులుంటుంది".

"మీరలా మాట్లాడితే మా పని పూర్తికావడానికి ఆస్కారం ఉండదు." బాధగా అన్నాడు సేతుమాధవరావు.

శృతి ఆలోచనలో పడింది. పాపం ఈయన చాలా మంచివాడిలా ఉన్నాడు. రెండు పిక్చర్లు అట్టర్ ఫ్లాప్ అయ్యి బాగా దెబ్బతిని ఈ పిక్చర్‌కి మరో పార్టనర్‌ని కలుపుకున్నాడు. తనని బుక్‌చేసి పెళ్ళాం బిడ్డల్ని పేవ్‌మెంట్ల మీదికి దించకుండా గట్టెక్కుదామని చూస్తున్నాడు. చాలాసేపు ఆలోచించి కడకి ఒక నిర్ణయానికొచ్చింది... "సరే మాధవరావుగారూ! శైలూషి చిత్రవాళ్ళ డబ్బింగ్ కాల్‌షీట్లు నైట్‌కి ఛేంజ్ చేయిస్తాను."

"చాలా థాంక్స్ శృతిగారూ!"

"ఈ మధ్యకాలంలో నా ఆరోగ్యం బాగా దెబ్బతిందండీ, డాక్టర్ నైట్ టైమ్స్ వర్క్ చెయ్యొద్దన్నాడు."

"పాపం మీరు చాలా కష్టపడుతున్నారు నా గురించి."

"లేదులెండి. నాకెంతో సహాయం చెయ్యదల్చుకున్న మీకు ఈ మాత్రం చెయ్యకపోవడం అమానుషత్వం అవుతుంది."

"నేను మీకు చెయ్యాలనుకున్న సహాయం ఒక ఆడదాని ఆర్తి సహించలేక."

"కానీ, నేను మీరీ హెల్ప్ త్వరగా చేస్తారన్న ఆశతో మీకు పనిచేయడానికి ఒప్పుకున్నాను."

"సరే... నే నర్థంచేసుకున్నాను... మార్నింగ్– కాస్ట్యూమ్ ఛీఫ్... ఆర్టుడైరెక్టరూ వస్తారు, విగ్స్ మెజర్‌మెంట్లూ, కాస్ట్యూమ్స్ కొలతలూ తీసుకోవడానికి... "గుడ్ నైట్" నిర్మాత సేతుమాధవరావు వెళ్ళిపోయాడు.

* * *

శృతి అందాన్నీ– డబ్బునీ – మానసిక బలహీనతల్నీ చూసి యెందరో ఆమెని వశీకృతం చేసుకోవాలని చూస్తున్నారు. మానసికంగా ఆమె కృశించిపోవడానికి... రకరకాల కష్టాలకీ, సమస్యలకీ గురికావడానికి వీళ్ళంతా కారణం.

వీళ్ళ రాపిడిలో ఆమె అనుక్షణం కుళ్ళిపోతోంది. విలవిల్లాడిపోతుంది. క్షణం శాంతి ఉండదు. చాలా చిత్రంగా వంచిస్తుంటారు.

శృతి అంటే అమితంగా ఆశపడేవాళ్ళలో హీరో మురహరి ఒకడు.

మురహరి అందంగా ఉంటాడు. (లేకపోతే తెలుగు హీరో ఎలా అవుతాడు?)

సిన్మాలో అతను వేసే పాత్రలన్నీ ఆడియన్స్‌కి జాలిపుట్టించేవీ... అతన్నభి మానించబడేవీ... పూజించబడేవీను.

వ్యక్తిగతంగా అతనెలాంటి మనిషి? అని ప్రశ్నించేకంటే అతని గతం పరదాల్ని ఒక్కసారి వెనక్కి లాగి చూస్తే నిజం తెలియచ్చు. అంతేగానీ వాడో రోగ్... వాడో సిల్లీ బాస్టర్డ్ అనడం బాగోదు. వాడో వంచకుడండీ... విశ్వాసఘాతకుడు కూడాను, అనకూడదు. ఎందుకనకూడదంటే ప్రూఫ్‌లు చూపించకుండా తిడ్తున్నాం కాబట్టి.

మురహరి పదివేలు చేత్తోపట్టుకుని ఇండస్ట్రీకొచ్చాడట. తాజ్ కోరమాండల్ హోటలులో ఓ వారం, హోటల్ చోళాలో వారం గడిపేసరికి పదివేలూ పకోడీల్లా అయిపోయాయట. ఖాళీ చేతుల్తో పేవ్‌మెంట్లపాలైతే హరిమతి అనే ఆమె అతన్నాదుకుంది. ఆండవార్ నగర్ లీలానిలయంలో మూడంతస్తుల పాతమేడలో మూడోపోర్షన్ ఆమెది. తన డబ్బుతో అతనికి మంచిబట్టలు కుట్టించి, తన శరీరం నిర్మాతలకిచ్చి, వేషాలిప్పించింది అతనికి.

అలా హరిమతి కారణంగా హీరో అయ్యాడు మురహరి. రానురాను హరిమతి హరిమతిలానే ఉంది. హీరో మురహరి చాలా మెట్లెక్కి చాలా పైకెళ్ళాడు.

ఈసారి మురహరి విశ్వాసఘాతకుడు అనడం అసమంజసం కాదేమో... కాదు.

ఆళ్వార్‌పేట పక్క సీతమ్మ కాలనీలో మోడ్రన్‌గా కట్టి, ముక్కుపొడుం రంగేసిన మేడ మురహరిది. అతని ఫారిన్ ఫియట్ కారు నెమలికంఠం రంగుది.

ఆ మధ్య డైలీ అతనికి ఫాన్‌మెయిల్ చాలా అధికంగా వచ్చేది.

"ఆడవాళ్ళు రాసినవి ఇలా పారెయ్" అని పి.ఏ.కి ఒకరోజు చెప్పినప్పట్నుంచీ అలానే చేస్తున్నాడు పర్సనల్ అసిస్టెంట్.

మృదుల. ఈ పేరు చాలా అందంగా ఉందికదూ? ఆ అమ్మాయిది అనంతపురం దగ్గర పల్లెటూరు.

"ప్రియమైన మురహరిగారూ!

ప్రతిబింబాలు చిత్రంలో మీ పాత్ర చాలా ఉన్నతమైంది. భగ్న ప్రేమికుడుగా మీరా పాత్రలో జీవించారు. ఆ పాత్రకీ జీవితానికీ ఏదో అవినాభావసంబంధం ఉందనిపిస్తుంది. మీ అంత అందమైన మనిషి ప్రేమిస్తానంటే ఏ ఆడదీ కాదనకూడదు. అంటే ఆమెకి శాపం తప్పదు. నేనే అయితే మీ చరణాల దగ్గరవాలతాను.

నిజమండీ! మీ చిత్రంపడ్డ ప్రతీపత్రికా దాచి, పెద్ద ఆల్బమ్ తయారుచేశాను. నా దైనందిన జీవితం వాటిని తనివితీరా చూడ్డమే.

మీ చిత్రం విడుదల కాబోతుంటే టికెట్స్ అడ్వాన్స్ బుకింగ్ క్యూలో మొదట నిలబడేది నేనే. ఇది ఆరాధన. మీ లేఖకోసం నాకు నిరీక్షణ తప్పదు.

మీ చరణదాసి
మృదుల..."

ఆ ఉత్తరానికి పెద్ద జవాబు రాశాడు మురహరి.

అంతే. తిరిగి ఆమె నుంచి జవాబు రాకుండా ఆమె వచ్చేసింది. ఒట్టినే రాలేదు నగలూ– డబ్బూ దాదాపు 25 వేలు ఖరీదుచేసేవి... వాటితో వచ్చింది.

ఆమెతో 3 నెలలున్నాడు.

ఒకరాత్రి అతని పక్కలో వున్న మృదుల అంది.

"నేను నీళ్ళుపోసుకున్నానండీ" అని. దానికి మురహరి...

"రోజూ పోసుకోవడం లేదా... దూరం జరుగు వాసన" అన్నాడు హాస్యంగా.

సెంట్రల్‌స్టేషన్‌లో రాత్రయితే ఎన్నో రైళ్ళెళ్తుంటాయ్. ఒకరోజు ఆమెని రైలెక్కించేశాడు, డబ్బుని తన దగ్గరే ఉంచుకుని.

ఈసారి మురహరిని వంచకుడు అనొచ్చేమో! అనొచ్చా? ఓహో అనొచ్చు.

అలా చాలామంది అమ్మాయిల్ని పెళ్ళిచేసుకుంటానని ప్రమాణం చేసి గర్భిణీలుగా మాత్రంచేసి వదిలాడు. సినీ జర్నలిస్టులు "మీరింకా పెళ్ళెందుకు చేసుకోలేదు?" అని అడిగితే "దుర్భిణీవేసి చూస్తున్నాను నా ధర్మపత్నికోసం. ఈ నాటికి దొరికింది" అంటాడు.

"ఎవరు?"

"శృతి."

ఆ వార్తని విలేకరులు మొదటిపేజీలో వర్ణించి రాశారు.

ఆ పేపర్లు పట్టుకుని శృతి దగ్గరకెళ్తే...

"నా ఆలోచనలు వేరు. ఆశయం వేరు. అలాంటి ఊహలు అల్లుకు కూర్చోవద్దు" అంది.

"అంటే నేను నిజజీవితంలో హీరోగా పనికిరానా?"

"వాస్తవ జీవితాల్లో హీరో-హీరోయినులూ-కామెడీ-విలనూ-వ్యాంపూ ఉండరట. ఈ మహాప్రవాహంలో మనిషి ఏకాకి అట."

"శృతిగారూ! నా హోప్‌ని మీరు పుల్లముక్కలా విరిచి పారేస్తున్నారు, న్యాయమా? నా ప్రగాఢ విశ్వాసం మీరు నాకు దక్కుతారని. నిర్మొహమాటంగా నా మనసు విడదీసి చెప్తున్నందుకు ఫీలవ్వద్దు. అవుట్ ట్రాన్స్ అదే అంత్యనిష్ఠూరం దానికంటే ఆదినిష్ఠూరం మేలనే అన్నారనుకోండీ" అనేసి లేచెళ్ళిపోయాడు.

రాయబారాలెన్ని పంపినా శృతి ఒక్కటే జవాబు.

ఈ ఆడది కసాయి అనుకున్నాడు కొన్ని రోజులు చూసి.

ఇలాంటి జాతిని హింసించి ఫలం పొందాలేమో అనుకున్నాడు.

* * *

ఆ దినం షూటింగ్ ఆఫ్ కాల్‌షీటు. మధ్యాహ్నం 2 గంటలకి వచ్చేసింది ఇంటికి.

ఇంట్లో పాదం పెట్టేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉంది.

ఇన్‌కంటాక్స్ వాళ్ళు ఇంటిని సోదా చేస్తున్నారు.

పి.ఎ. శివమోహన్ ధైర్యంగా నిలబడి ఉన్నాడు.

శృతి కూడా మౌనంగా సోఫాలో కూర్చుంది.

ఇన్‌కమ్‌టాక్స్ వాళ్ల సోదా 2 గంటలకి పూర్తయింది. వాళ్ళు సోఫాలో అలసటతో విశ్రాంతి తీసుకుంటున్న శృతి దగ్గరకొచ్చి...

"సారీ మేడమ్, రాంగ్ ఇన్‌ఫర్మేషనందింది" అన్నారు.

శృతి లేచి వాళ్ళని కూర్చోమని కాఫీలు తెప్పించింది.

వాళ్ళెళ్ళిపోయారు.

శృతిలో అలసట మరింత పెరిగింది. ఇలాంటివి, ఇంతకంటే బలమైనవీ ఆమె మనసును కలచివేస్తుంటాయ్. "శృతిని హింసించడం కొందరికి సరదా" విషాదంగా నవ్వుతూ శృతే అంటుంది అలా.

* * *

10వ తేదీ మధ్యాహ్నం 3.30 నిమిషాలకి మద్రాసు నుంచి బయల్దేరే జమ్ముతావీ జనతా ఎక్స్‌ప్రెస్‌లో కాశ్మీర్ షెడ్యూల్ వేసిన శివరంజనీ మూవీస్ యూనిట్ బయల్దేరింది. మొత్తం నాలుగు రోజులు ప్రయాణం.

ఈ సినిమాకి హీరోయిన్ శృతి. మరి హీరో? మురహరి.

డైరెక్టరూ... మురహరీ... కెమెరామెన్ వీళ్ళంతా ఒక ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్. పక్క మరో మొదటి తరగతి బోగీలో శృతీ... ఆమె అసిస్టెంటు రాజీ– డాన్స్ మాస్టర్ సుశీలా ఉన్నారు. ఇంకా అసిస్టెంటు డైరెక్టర్లూ ... కెమెరా అసిస్టెంట్లూ...

వీళ్ళంతా మరో సెకెండ్ క్లాస్ పెట్టె ఎక్కారు. మొత్తం జనాభా ముప్ఫయిమంది. రైలు బయల్దేరింది.

ఈ ప్రయాణం చాలా హాయిగా సాగుతుందని తలిచింది శృతి. గ్లాస్ డోర్స్ తీసేసి కిటికీలోంచి చూస్తోంది. జుట్టు ఎగిరి ముఖంమీద పడుతుందని బ్లూ రిబ్బన్ కట్టేసింది. గిరగిరా తిరిగే ప్రకృతిని చూస్తూ ఆలోచిస్తోంది...

సేతు మాధవరావు చాలా మంచివాడు. అందుకే ఆ మనిషికి సరైన స్థానం లేకుండాపోతోంది. చాలామంది చెప్పారు అతను మాటిస్తే నిలబెట్టుకుంటాడు.

శృతి జీవితం ఒక పుస్తకంగారాస్తే, ప్రతీ పేజీలోనూ నమ్మినవాళ్లు మోసం చేసిన సంఘటనలు ఎన్నో స్పష్టం అవుతుంటాయ్. అయినా మనుషుల్నామె నమ్ముతుంది దేవుడెలానూ సహాయపడడు గాబట్టి.

రైలు వేగాన్నందుకుంది బాగా రాత్రయింది. కిటికీలోంచి వచ్చేగాలి, ఊపిరి సలపనివ్వడం లేదు.

శూన్యం... నిశిరాత్రి. అక్కడక్కడా మెర్క్యురీ దీపాలు కన్పించి మాయ మౌతున్నాయ్. ఆకాశంలో చుక్కల గుంపులు రైలుతో పాటు వస్తున్నాయ్. గాలిరివ్వున వీయడం, "కడక్... కడక్" మనే రైలు ధ్వన్లు.

ఆమెకి విసుగ్గాలేదు. చాలా హాయిగా ఉంది. ఏకాకికి గొప్ప శాంతి లభిస్తుంది. కానీ చరిత్ర ఉండదు.

వర్తమానాన్ని అనుసరిస్తే తను శాంతిలో ఇమిడుంది. కానీ ఏవో ఊహలు. జ్ఞాపకాన్ని తన ముందు ప్రతిష్ఠించుకోవాలనుకుంటుంది.

ఎప్పుడో ఆ జర్నలిస్టు చైతన్య అన్నాడు.

సృష్టియెలా పుట్టిందో ఎప్పుడు పుట్టిందో తెలీదుగాని శృతీ! ప్రతీ క్షణం మన కళ్ళముందు సృష్టి జరుగుతుంది. క్షణక్షణం ప్రకృతిలో మార్పు.

చైతన్య. తనింతటి కీర్తిమకుటం ధరించడానికి మూలం చైతన్యే.

కానీ ఒక విషయంలో తనని మోసం చేశాడు చైతన్య. తనని పిచ్చిదాన్ని చేశాడా రోజు. తన మనసుని చాలా హింసించాడా రోజు. తన బాబుని దొంగి లించుకుపోవడం న్యాయమా చైతన్యకి?

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Vennela+Bomma**

* * *